క్లుప్తంగా

గెలుపోటములు సహజం


బహుమతులు ప్రదానం చేస్తున్న తిరుపతిరెడ్డి

దౌల్తాబాద్: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు తిరుపతిరెడ్డి అన్నారు. యువజన సంఘం ఆధ్వర్యంలో మాటూరులో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హన్మంత్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

కుల్కచర్ల: గ్రామాభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తానని చాకల్‌పల్లి సర్పంచ్ రాములమ్మ అన్నారు. ఆదివారం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అబివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని తెలిపారు. స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపనోత్సవం

యాలాల: మండల పరిధిలోని సంగెంకుర్దు పరిధిలో గల సంగమేశ్వరాలయం పక్కన శనీశ్వర దేవాలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గణపతి పూజ, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించగా.. సోమవారం నవగ్రహ హోమం, పూర్ణాహుతి, నైవేద్యం జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనీశ్వర దేవాలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈనెల 27 వరకు వివిధ కార్యక్రమాలను చేపడతామని సర్పంచ్ శ్రీలత తెలిపారు. ఆలయ నిర్మాణ స్థపతి రామలింగం, విగ్రహ నిర్మాణ స్థపతి జయరాంల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

తట్టెపల్లికి మండల హోదా ప్రకటించాలి

పెద్దేముల్: అన్ని అర్హతలున్న తట్టెపల్లిని ప్రభుత్వం మండల కేంద్రంగా ప్రకటించాలని తట్టెపల్లి పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాటితో రిలే నిరాహార దీక్ష 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇతర జిల్లాల్లో కొత్త మండలాలను ప్రకటించి తట్టెపల్లిని విస్మరించిందని ఆరోపించారు. ఏడాది కాలంగా మండల కేంద్రంగా గుర్తించాలని నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. జిల్లాలో పూర్తిగా అభివృద్ధిలో వెనుక బడిన ప్రాంతం తట్టెపల్లి అని, 11 గ్రామాలున్న తట్టెపల్లిని మండలంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు శంకర్ నాయక్, గోపాల్, మాణిక్‌పటేల్, కాశీంసాబ్, యూసుఫ్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

బషీరాబాద్: సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమేష్ కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ కరుణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

సమ్మెను విజయవంతం చేయాలి

అనంతగిరి: తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్-82 ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు ఆర్టిజన్స్ పీఆర్సీ ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని హెచ్ 82 యూనియన్ వికారాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాన్ ఒక ప్రకటనలో కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఎన్నోసార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలి

కుల్కచర్ల: ఈ నెల 26న బూరెడ్డిపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేడ్కర్ చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తుప్పలి అశోక్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రంలో కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో బుడగ జంగం సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, కుల్కచర్ల మాజీ సర్పంచ్ వెంకటయ్య, అంబేడ్కర్ సంఘం నాయకులు వెంకట్రాములు, చుక్కయ్య, నర్సింహులు, వెంకటయ్య, రాజు, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేయాలి

తాండూరు టౌన్: ప్రైవేటు ఆసుపత్రులు వ్యాపార ధోరణితో కాకుండా సేవాభావంతో వైద్య సేవలందించాలని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. ఆదివారం పట్టణంలోని మార్వాడి బజార్‌లో సాయి రాఘవ ఆసుపత్రిని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ.. రోగులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

మృత్యుఘంటికలు

- ఉరుములు, మెరుపులతో పిడుగులు
- అకాల వర్షాలతో అపార నష్టం
- బుగ్గిపాలవుతున్న వన సంపద
- మూగజీవాలు, పశువుల కాపరుల మృత్యువాత
- జాగ్రత్తలు తీసుకుంటే ముప్పునుంచి తప్పించుకోవచ్చు: నిపుణులు

కాలం ఏదైనా.. అనుకోకుండా ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడితే పిడుగులు పడటం సహజం. అది పడిందంటే చాలు ఎక్కడో ఓ చోట ఆస్తినష్టం, ప్రాణనష్టం సంభవిస్తుంది. వర్షాకాలంలో ఇక చెప్పనక్కర్లేదు. పిడుగులు ఎక్కువగా చెట్లపై, వ్యవసాయ, అడవీ ప్రాంతాల్లో పడుతుంటాయి. దీంతో వనసంపదతో పాటు.. మూగజీవాలు, పశువుల కాపరులు, రైతులు మృత్యువాత పడుతుండడంతో పిడుగుపాటంటే ప్రజలు కలవరపాటుకు గురవుతున్నారు.


పిడుగు పాటు సమయంలో వచ్చే మెరుపులు


ఇటీవల వికారాబాద్ సమీపంలో పిడుగు పడి దగ్ధమవుతున్న చెట్టు

వికారాబాద్: వర్షాలు కురిసినప్పుడు ఎప్పుడు ఎక్కడ పిడుగుపడి ఎవరిని కబలిస్తుందో తెలియదు. ఇలా పిడుగు పాటుకు ఏటేటా 24 వేల మంది మత్యువాత పడుతున్నారని, మరో రెండు లక్షల మంది వరకు గాయాలపాలవుతున్నట్లు ప్రపంచ ప్రకృతి వైపరిత్యాల గణాంకాలు చెబుతున్నాయి. విశ్వ వ్యాప్తంగా ప్రతి సెకనుకు 100కు పైగా పిడుగులు పడుతున్నాయన్న అంచనా లేకపోలేదు. ఇదిలా ఉండగా.. గడిచిన వారం రోజుల్లో జిల్లాలో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. వికారాబాద్‌లో ఓ చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. వాటిని చూసిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

29,000 సెల్సియస్ ఉష్ణోగ్రత

పిడుగు పాటుపై పల్లెల్లో అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి. దేవదానవ యుద్ధం కారణంగా ఇలా ఉరుములు, మెరుపులు వస్తాయని.. అప్పుడు అర్జున, పాల్గున అంటే వారు మనల్ని పిడుగుల భారి నుంచి రక్షిస్తారని పెద్దలు చెబుతుంటారు. అయితే శాస్త్రియంగా కారణం వేరే ఉంది. నిరంతరం మండుతున్న అగ్నిగోళంగా చెప్పుకునే సూర్యుని ఉపరితలంపై 5,700 సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. కాని పిడుగు పడినప్పుడు ఉత్పన్నమయ్యే ఉష్ణోగ్రత.. ఉపరితల ఉష్ణోగ్రతకు సుమారు ఐదు రెట్లు అధికంగా 29 వేల సెల్సియస్ ఉంటుందట.

పిడుగు అంటే ఏమిటి?

మేఘాల వద్ద ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వలన.. వాటి ఆవిరి నీటి బిందువుల రూపంలో ఉంటుంది. అదే సయంలో విపరీతమైన గాలులు వీచినప్పుడు ఆ మంచు కణాలు, నీటి చుక్కల మధ్య రాపిడి జరిగి.. ఎలక్ట్రికల్ చార్జి ఉత్పన్నమవుతుంది. దీంతో పాజిటివ్, నెగిటీవ్ చార్జి ఉన్న కణాలు విడుదలవుతాయి. వీటిలో పాజిటివ్ చార్జి కణాలు తేలికగా ఉండటం వలన అవి మేఘంలోని పై భాగానికి, అలాగే నెగిటివ్ కణాలు బరువుగా ఉండటంతో దిగువకు చేరుకుంటాయి. అప్పుడు అవి అయస్కాంతంలోని ఉత్తర దక్షిణ ధ్రువాలు ఎలా ఆకర్షించుకుంటాయో అలాగే అక్కడ జరుగుతుంది. రెండు వేరు వేరు మేఘాలు దగ్గరగా వచ్చినప్పుడు..పై మేఘంలో ఉండే నెగిటివ్ చార్జ్ కణాలు.. కింద మేఘంలో ఉన్న పాజిటివ్ చార్జి కణాల మధ్య రాపిడి జరుగుతుంది. దీంతో ఆ రెండింటి మధ్య మెరుపు.(విద్యుత్తు), ఉరుము(శబ్దం) ఉత్పన్న మవుతాయి. ఈ సమయంలోనే మేఘంలోని కింది భాగంలో ఉండే నెగిటివ్ చార్జి కణాలు భూ ఉపరితలంపై ఉండే పాజిటివ్ చార్జి కాణాలచేత ఆకర్శించబడతాయి. ఇలా నెగిటివ్ చార్జి కణాలు భూమిని చేరే క్రమంలో మేఘాల్లో రాపిడికి ఉత్పన్నమై విద్యుత్ భూమిని చేరుతుంది. దీన్నే మనం పిడుగు అంటాం..

నిపుణుల సలహాలు

కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం వలన పిడుగు పాటు నుంచి బయటపడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. 1.ఉరుములు, మెరుపులు పిడుగులు పడే సమయంలో ల్యాండ్‌లైన్ ఫోన్ మాట్లాడకూడదు. 2.ల్యాండ్‌లైన్ ఫోన్‌కు బదులు కార్డ్‌లెస్ ఫోన్‌గాని, సెల్ ఫోన్‌గాని వాడవచ్చు. అది ఇంట్లో ఉండి మాత్రమే. 3. ఆ సమయంలో టీవీ చూడటం ప్రమాదం. ఇంకా చెప్పాలంటే స్విచ్‌బోర్డుల నుంచి ప్లగ్‌లు తీసి వేయాలి. లేదంటే ఎలక్ట్రిక్ వస్తువులన్నీ పాడయ్యే ప్రమాదముంది. 4.ట్యాప్‌కింద చేతులు, గిన్నెలు కడగటం, షవర్‌కింద స్నానం చేయటం లాంటివి చేయకూడదు. 5.ఇంటి కిటికీలు, తలుపుల దగ్గర నిల్చోవటం. 6. చెట్లకింద ఉండకూడదు. ఎందుకంటే చెట్లు, విద్యుత్తు స్తంభాలు పిడుగులను ఆకర్షిస్తాయి. అందుకే చెట్లపైన ఎక్కువగా పిడుగులు పడుతుంటాయి. 7.పిడుగులు పడే సమయంలో గొడుగు వాడకూడదు. ఎఫ్ఎం రేడియో వినకూడదు. 8. షెల్టర్ దొరకకుంటే ఎతైన ప్రదేశాల్లో కూర్చుని, తలకిందకు వంచి చెవులు, కళ్లు మూసుకుని కూర్చోవాలి. 9.పెంపుడు జంతువులను బయట వదిలేయకుండా షెడ్లలో ఉంచాలి. 10.ఉరుములు, మెరుపుల సమయంలో మన శరీరం జలదరింపునకు గురి కావటం, వెంట్రుకలు నిక్కబొడుచుకోవటం లాంటి సంకేతాలు సూచిస్తాయి. ఇలా జరిగితే పిడుగు మీకు సమీపంలో పడుతున్నట్లు అర్థం.

జాగ్రత్తలు పాటించాలి

ప్రాణాలకంటే ఏదీ ఎక్కువ కాదు. ఇటీవల జిల్లాలో పిడుగుపాటుకు మూగజీవాలు(జీవాలు, పశు సంపద) మత్యువాత పడటం చూశాం. తగిన జాగ్రత్తలు పాటిస్తే చాలా వరకు పిడుగుల నుంచి తప్పించుకోవచ్చు. మిగతా అన్ని సామాజిక అంశాలతో పాటు.. ఈ విషయంలోనూ పోలీసు శాఖ అవగాహన కల్పిస్తుంది. సామజిక బాధ్యతగా భావించి తెలిసిన వారు కూడా అవగాహన కల్పించటంలో భాగస్వాములు కావాలి.

– కోటిరెడ్డి, ఎస్పీ

ప్రజావాణి నేడు

తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చిన్నప్పల నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు.

రేపు బీఆర్ఎస్ సమావేశం

కొడంగల్: పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఈనెల 27వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఉందని, కార్యక్రమానికి రెండు రోజుల ముందు 25న అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలని సూచించారు. మండల కమిటీ అధ్యక్షులు, మున్సిపల్ అధ్యక్షులు, గ్రామ కమిటీ అధ్యక్షులు పార్టీ జెండాను ఆవిష్కరించాలన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కుల్కచర్ల: ఆపదలో ఉన్న బాల్య మిత్రుడి కుటుంబాన్ని ఆదుకోవాలని భావించిన నాటి సహ విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. చౌడాపూర్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్ కొన్నిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. 2005 సంవత్సరంలో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులు.. శ్రీనివాస్ భార్యకు రూ.50,700లు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గోవింద్, నవీన్, తులసిరాం, బాల్‌సింగ్, రాజు, రవీందర్, రమేష్, బాల్‌రాజ్, గోపాల్, రాంచందర్, యాదయ్య పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు వితరణ

యాలాల: హాజీపూర్ గ్రామానికి చెందిన లాలప్ప, నాగమణి దంపతుల కూతురు అనురాధ వివాహం ఆదివారం జరగగా.. తన వంతు సహాయంగా సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ పుస్తెమెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇక ముందు పేదింటి ఆడబిడ్డల వివాహానికి పుస్తెమెట్టెలు అందజేస్తానని తెలిపారు.

కంట్రోల్ రూమ్‌తో విద్యుత్ సమస్యలకు చెక్

- ఆర్టిజన్ కార్మికులు సమస్యలు సృష్టిస్తే చర్యలు తప్పవు: విద్యుత్ శాఖ

తాండూరు: విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులు హక్కుల సాధన కోసం ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మెబాట పట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య తలెత్తకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎలాంటి సమస్య వచ్చినా.. జిల్లా, డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు విద్యుత్ వ్యవస్థను పర్యవేక్షించనున్నారు. అయితే ఆర్టిజన్ కార్మికులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద విద్యుత్ సరఫరా లేకుండా చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని చూసే అవకాశం ఉందని, అలాంటి సంఘటనలు జరిగితే.. ప్రజలు ఫొటోలు తీసి పంపించాలని అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు సబ్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికుల స్థానంలో డిపార్ట్‌మెంట్ ఉద్యోగులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ జయరాజు పేర్కొన్నారు. సమ్మెతో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే వినియోగదారులు సహకరించాలని, కంట్రోల్ రూమ్ నంబర్లు 94931 93177, 94914 41225లను సంప్రదించాలని కోరారు.

మూడు దశాబ్దాల మురిపెం

- ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అధ్యాపకులతో పూర్వవిద్యార్థులు

తాండూరు టౌన్: మూడు దశాబ్దాల క్రితం కలిసి డిగ్రీ చదివిన వారంతా ఒక్క వేదికపైకి వచ్చారు. నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆదివారం స్థానిక దుర్గా గ్రాండ్యూర్ హోటల్‌లో పీపుల్స్ డిగ్రీ కళాశాలకు చెందిన 1990వ సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిర పడిన విద్యార్థులందరూ కలుసుకున్నారు. నాడు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాటి ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఆ రోజుల్లో గురుశిష్యుల బంధం, విద్యార్థుల క్రమశిక్షణ, విద్యాబోధన గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. తమ వద్ద చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండటం సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థి, ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి (రాఘవపూర్) మాట్లాడుతూ.. చదువులో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా గురువుల సహాయ సహకారాలతో చదివి యూనివర్సిటీలో గోల్డ్‌మెడల్‌తో పాటు నాలుగు ఉద్యోగాలు సాధించానని తెలిపారు. నేను ఈ స్థాయికి చేరుకోవడంలో గురువుల పాత్ర ఎంతో కీలకమన్నారు. నాటి అధ్యాపకులు రంగారావు, వరలక్ష్మి, బ్రిజ్ గోపాల్, తిప్పయ్య, పీడి రాంచంద్రయ్య, లైబ్రేరియన్ నారాయణ, అటెండర్లను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మహావీర్ సింగ్, జనార్దన్ రెడ్డి, నాగయ్య, అనర్ సింగ్, చంద్రశేఖర్, వెంకటరెడ్డి, నిర్ని చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, మంగమ్మ, పరమళ, పద్మావతి పాల్గొన్నారు.

అభ్యుదయ విశ్వగురువు బసవేశ్వరుడు


దోమలో ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి తదితరులు


అనంతగిరి: వికారాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్


పెద్దేముల్‌లో.. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ తదితరులు

- సామాజిక సమానత్వానికి కృషి చేసిన మహనీయుడు
- సంఘ సంస్కర్త జయంత్యోత్సవంలో వక్తలు

పెద్దేముల్: అభ్యుదయ విశ్వగురువు, సామాజిక సమానత్వానికి కృషి చేసిన మహనీయుడు సంఘ సంస్కర్త బసవేశ్వరుడు అని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. బసవేశ్వరుడి జయంతి సందర్భంగా ఆదివారం కందనెల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని.. బసవ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరశైవ సమాజం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, సర్పంచ్ మోహన్‌రెడ్డి, కందనెల్లి అధ్యక్షుడు సిద్దేశ్వర్, పోట్లి మహరాజ్ దేవస్థానం ధర్మకర్త సిద్ది రామప్ప, జర్నలిస్టు శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

బసవన్నల ఊరేగింపు

కొడంగల్: సంఘ సంస్కర్త బసవేశ్వరుడి జయంతి సందర్భంగా అధికారికంగా తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయం, మహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, మహాదేవుని ఆలయంలో వీరశైవ లింగ బలిజ సమాజం సభ్యులు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాడిబాయి శివాలయం నుంచి మహాదేవుని ఆలయం వరకు బసవన్నలతో (ఎద్దులు) ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, డీసీసీబీ మాజీ డైరెక్టర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆర్.బస్వరాజ్, మున్సిపల్ కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, మాజీ వీఆర్ఓ రాంరెడ్డి, వీరశైవలింగబలిజ సమాజం సభ్యులు బాల ప్రకాశ్, శంకర్‌లింగం, సంగప్ప, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సూచనలు అనుసరణీయమైనవి

దోమ: విశ్వగురువు మార్గం ఆచరణీయమైనదని, నేటి సమాజం ఆయన సూచనలకు అనుగుణంగా నడవాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బసవేశ్వరుడి జయంతి సందర్భంగా దిర్సంపల్లిలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నవాజ్ రెడ్డి, సర్పంచ్ శాంత కొండారెడ్డి, సంతోష్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, సొసైటీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, హన్మంతు, రాంచంద్రారెడ్డి, ఆంజనేయులు, సర్వారెడ్డి, రాములు, సలీం, మొగులయ్య పాల్గొన్నారు.

పనే ప్రత్యక్ష దైవం

యాలాల: బసవేశ్వరుడి జయంతి సందర్భంగా మండల కేంద్రంతో పాటు దేవనూరులో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. స్త్రీ అభ్యుదయ సంఘ సంస్కర్త, మూఢ నమ్మకాలను పక్కన పెట్టి జ్ఞానం వైపు పయనించాలని, పనే ప్రత్యక్ష దైవం అని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి బసవ అని కొనియాడారు.

మనుషులంతా ఒక్కటే..

తాండూరు టౌన్: మనుషులంతా ఒక్కటేనని, సమానత్వాన్ని చాటి చెప్పిన మహనీయుడు బసవేశ్వరుడని పలువురు కొనియాడారు. బసవ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్, సయ్యద్ షుకూర్, వెంకటేశ్, లక్ష్మణాచారి, బస్వరాజ్, వెంకట్, నరేష్, బీజేపీ నాయకులు సుదర్శన్ గౌడ్, భద్రేశ్వర్, కృష్ణ, సతీష్, షర్మిల, శివ, చంద్రశేఖర్ తదితరులు నివాళులర్పించారు

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: బసవేశ్వరుని ఆశయాలను ప్రతి ఒక్కరు సాధించాలని వీరశైవ సంఘం అధ్యక్షుడు బస్వరాజు స్వామి అన్నారు. బసవేశ్వరుడి జయంతి సందర్భంగా ఆయన.. బసవ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రామకృష్ణ, పటేల్ బస్వరాజ్, మహంత్‌స్వామి, శేఖర్, సంగప్ప పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: బసవేశ్వర జయంతిని వీరశైవలింగాయత్‌లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత్ సభ్యులు వీరన్న, శేఖర్, నాగభూషణం, నవీన్‌కుమార్, రాకేష్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: బసవేశ్వర జయంతి ఉత్సవాలను మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలో జెడ్పీటీసీ మధుకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి సుభాష్ యాదవ్, వికారాబాద్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి దివాకర్, కల్‌ఖోడ సర్పంచ్ శివకుమార్, మాజీ సర్పంచ్ పాండునాయక్ తదితరులు బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

కుల్కచర్లలో..

కుల్కచర్ల: బసవేశ్వరుడి జయంతి సందర్భంగా.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతగిరి: మహాత్మా బసవేశ్వరుడు అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. వికారాబాద్ పట్టణంలోని బసవేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీలో ఏర్పాటు చేసిన బసవేశ్వర జయంతిలో ఎమ్మెల్యే పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బసవేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, వీరశైవసమాజం అధ్యక్షుడు విజయ్‌కుమార్, సొసైటీ చైర్మన్ బస్వరాజు, పలువురు జిల్లా అధికారులు, మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు జగదీష్, వీడీడీఎఫ్ శ్రీనివాస్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. మాజీ మంత్రులు ప్రసాద్‌కుమార్, డాక్టర్ ఎ.చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ధారూరులో..

ధారూరు: వీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో మహాత్మా బసవేశ్వర జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.


కొడంగల్: మున్సిపల్ కార్యాలయంలో పూజలు


పరిగిలో..


ధారూరులో..


బంట్వారంలో..


కుల్కచర్లలో..


మర్పల్లిలో..


దౌల్తాబాద్: తహసీల్దార్ కార్యాలయంలో..


మోమిన్‌పేటలో..


యాలాలలో..